కోతుల బెడదకు చెక్!

- కోతులు పట్టే వ్యక్తిని రప్పించిన అధికారులు
- ఒక్క కోతికి రూ.400



కోతులు పట్టేందుకు బుట్టలు రెడీ చేస్తున్న మురుగన్

కాళేశ్వరం: కోతులతో భక్తులు, ప్రజలు తెగ పరేషాన్ అవుతున్నారు. మనశ్శాంతి కోసం కాళేశ్వరం దేవాలయానికి వస్తే కోతులతో భయపడి అదరాలిందే. ఎటు నుంచి వస్తుందో అని బెదిరి బెదిరి చూడాల్సిందే. బస్టాండ్‌లో బస్సెక్కేందుకు చేతులో సంచితో వస్తే లాక్కొని వెళ్లి స్లాబుపై ఉన్న సందర్భాలు ఎన్నో. ఇంట్లో నుంచి కాలు బయటికి పెట్టాలన్నా కర్ర చేతుల్లో లేనిదే బయటికి రాలేని పరిస్థితి. ఇంటి ఆవరణలో బయట అంట్లు తోము కోవాలన్నా ఒకరు కాపలాతో ఉన్న గాభరా పడాల్సిందే. మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు దేవస్థానం, పంచాయతీ అధికారులు దాతల సాయంతో కోతులు పట్టే వ్యక్తిని రప్పించారు. దీంతో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతికి చెందిన మురుగన్–రేణుక దంపతులు గ్రామంలో దిగారు. వెంటనే తమ పనులు ప్రారంభించారు. బుట్టలు రెడీ చేస్తున్నారు. కోతులు తినేందుకు ముందుగా పల్లీలు చల్లుతూ కోతులను మచ్చిక చేస్తున్నారు. దీంతో కోతులు పట్టేందుకు సులువుగా ఉంటుందని ఆ వ్యక్తి చెబుతున్నాడు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కోతులు పట్టినట్లు తెలుపుతున్నారు. ఒక్క కోతిని పడితే రూ.400 వరకు తీసుకుంటానని చెబుతున్నాడు. కాళేశ్వరం సమీపంలోనే అటవీ ప్రాంతం కావడంతో వందల సంఖ్యలో కోతులు ఉన్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. మురుగన్ రంగ ప్రవేశం చేసి బుట్టలు అల్లికలు చేస్తుండంతో కోతులు బెదిరిపోతున్నట్లు చర్చ జరుగుతుంది. ఇటీవల కాళేశ్వరం దేవస్థానం అటెండర్ శంకర్‌ను కోతులు కరిచి గాయపరిచాయి. ఇలా ప్రతి రోజు కోతులు టార్గెట్ చేసి మరీ గెదుముతున్నాయి. చిన్న పెద్ద తేడా లేకుండా గాయపరుస్తున్నాయి. కోతుల బెడద లేకుండా చేస్తే గ్రామంతో పాటు భక్తులు ఊపిరి పీల్చుకుంటారు. ఈవిషయమై కార్యదర్శి నడిమెట్ల సత్యనారాయణ సంప్రదింగా.. కోతుల బెడద లేకుండా చేయాడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. కోతులను ఎలాంటి హాని కలిగించకుండా అడవిలో వదిలేస్తాం.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..



ఎమ్మెల్యే గండ్రకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

రేగొండ: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాల్లో రూ.14.75 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి కొత్తపల్లె (కె) వరకు రూ.5.25 కోట్లతో నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో ప్రజాప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు.

వినతిపత్రం అందజేత

కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గ్రామ సమైఖ్య భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు శివమణి గ్రామైఖ్య మహిళలు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 25 సంఘాలు 320 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గది లేకపోవడం ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు సభ్యులు తెలిపారు. కాగా, సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే భవనం మంజూరు చేయిస్తానని తెలిపారు. పీఆర్ డీఈ రవికుమార్, తహసీల్దార్లు లక్ష్మీరాజయ్య, శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు గాజర్ల అశోక్, సంపత్ రావు, పున్నం రవి, ఓంప్రకాశ్, మొట్టె కిరణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం: మండలంలోని విలాసాగర్ మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులే..



మొగుళ్లపల్లి: అవార్డులతో ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులే అని తహసీల్దార్ జాలి సునీత, ఎంపీడీఓ గోడిశాల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదే అని, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 10మంది ఉపాధ్యాయులకు శాలువా మెమోంటోతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



ప్రసంశ పత్రాలు, షీల్డ్‌లను చూపుతున్న ఉపాధ్యాయులు

మల్హర్: విద్యార్థులకు విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంఈఓ లక్ష్మణ్‌బాబ పురస్కారాలు, ప్రసంశ పత్రాలు అందించారు. మండలంలోని కొయ్యూరు ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎస్ నర్సింహరావు (మల్లారం జిల్లాపరిషత్), ఎస్ బీమేశర్ (రుద్రారం జిల్లాపరిషత్), స్వర్ణలత (తాడిచర్ల జిల్లాపరిషత్), నాగేశ్వర్ (ఎడ్లపల్లి మోడల్ స్కూల్), శైలజ (రుద్రారం పీఎస్), జలజ (పీఎస్ మల్లంపల్లి), శారద (పీఎస్ రుద్రారం), సరకుమారి (పీఏస్ వల్లెకుంట), రమాదేవి (పీఎస్ చిన్నతూండ్ల), అరుణ్‌కుమార్ (పీఏస్, తాడిచర్ల ఎస్సీ కాలనీ), రాకేశ్ (పీఎస్ తాడిచర్ల), సరిత (పీఎస్ గాదంపల్లి) ఉపాధ్యాయులకు ఎంఈఓ షీల్డ్‌లు, ప్రసంశ పత్రాలతో బహూకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడతాం..

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగజ్యోతి



నగదు అందజేస్తున్న నాగజ్యోతి

ములుగు: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుడు మహేశ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. బుధవారం బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను రూ.లక్ష 116ను, కింటాన్నర బియ్యం అందించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. భిక్షటన తమ ఉద్దేశ్యం కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలనే చేశామని అన్నారు. మహేష్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మృతిపై దుష్పచారం చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్‌కుమార్, నాయకులు వేములపల్లి భిక్షపతి, ఆకుతోట చంద్రమౌళి, విజయరాం నాయక్, సమ్మయ్య, కుమార్, భద్రయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, నగేష్, విజయ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైద్యాధికారి యోషిత



వైద్య పరీక్షలు చేస్తున్న యోషిత

వాజేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి యోషిత అన్నారు. మండల పరిధిలోని అయ్యవారి పేట, రాంపురం గ్రామంలో బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. అయ్యవారి పేటలో 40 మంది, రాంపురంలో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వర్షాకాలంలో వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని తినాలన్నారు. డెంగీ, మలేరియా రాకుండా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వేణు గోపాల కృషణ శ్రీను, అనూష, సంగీత తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- మాజీ ఎంపీ సీతారాంనాయక్



అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ర్యాలీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు నోచుకొని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మేడారం మహా జాతర పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణి నాయక్, భాస్కర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, గుగులోత్ స్వరూప, రవింద్రాచారి, వెంకట్, కృష్ణాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, మద్దినేని తేజరాజు, అల్లె శోభన్, సుధాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, నాగరాజు, మల్లేశ్, ఇమ్మడి రాకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి



భూపాలపల్లి రూరల్: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్రవెంకటరమణారెడ్డి



మల్హర్: వల్లెకుంటలో..



కాటారంలో..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బుధవారం అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం భూస్వాముల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి మార్గం చూపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

వీర వనిత చాకలి ఐలమ్మ

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

మల్హర్: తెలంగాణ సాయుధ పోరాట దీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని మండలంలోని వల్లెకుంట గ్రామాల్లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్ర పటానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేకుమట్ల: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్, వైనాల రవీందర్, నిమ్మల స్వామి, బోనగిరి తిరుపతి, జంగపల్లి సారయ్య, సదయ్య, అనిల్, సమ్మయ్య, రవీందర్, నిమ్మల బాలయ్య, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్లలో..

చాకలి ఐలమ్మ వర్ధంతి

కాటారం: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రధాన కూడలిలోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు పున్నం రాజయ్య, ముసాపురి నర్సయ్య, ఐలయ్య, శంకర్, లచ్చయ్య, సుమన్, రాజయ్య, పైడాకుల సురేశ్, కళ్లగుంట సురేశ్, రామిళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



మాట్లాడుతున్న మయాంక్‌సింగ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతినది పుష్కరాల్లో చేపట్టిన పనులను సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ బుధవారం పరిశీలించారు. కొన్ని పనుల్లో వేగం లేదని సంబంధిత అధికారులు, ఇంజనీర్లపై కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం 2027 జూలైలో నిర్వహించే గోదావరి నది పుష్కరాలకు వీఐపీ ఘాటు నుంచి మేయిన్‌ఘాటు వరకు రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణపై చర్చించారు. అనంతరం రైతులతో మాట్లాడారు.

గురుకుల పాఠశాలలో మాక్ పోలింగ్

ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం మైనార్టి గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై ప్రిన్సిపాల్ శ్రీలత అవగాహన కల్పించారు. పాఠశాలలో మెస్ లీడర్, సీక్ లీడర్, డార్మెంటరీ లీడర్, స్పోర్ట్స్, డిసిప్లెన్ లీడర్లను ఓటు ద్వారా ఎంపిక చేశారు. ఎలక్షన్‌లో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన



మల్హర్: తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు



కాటారంలో..

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫొటో ఎలక్టోరల్ రూల్స్, పోలింగ్ స్టేషన్ తుది జాబితాను బుధవారం ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 22446 ఓటర్లు నమోదయినట్లు చెప్పారు. వీరిలో పురుషులు 10967, మహిళల 11479 ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే 46 పోలింగ్ స్టేషన్లు జాబితాను ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మహేందర్, తాడిచర్ల కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు

కాటారం: మండలంలోని ఎంపీటీసీ స్థానాల పరిధిలోని తుది ఓటర్ జాబితా, పోలీంగ్ స్టేషన్ల వివరాలను బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు విడుదల చేశారు. ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు, 51 ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లు, 30785 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వాజేడు: మండలంలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బోదెబోయిన సాయి తెలిపారు. బుధవారం పలు హాస్టళ్లను ఆయన సందర్శించి మాట్లాడారు.సంక్షేమ హాస్టల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలను పెంచాలని మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఎస్సీ హాస్టల్ భవనాన్ని మరమ్మతులు చేయాలని కోరారు.

జీఎంను కలిసిన రజనీకుమార్



జీఎంను సన్మానిస్తున్న రజనీకుమార్

కాటారం: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన హనుమంత్ నాయక్‌ను హైదరాబాద్ డీఎస్ఎస్ భవన్‌లో బుధవారం మండలంలోని చిద్నెపల్లికి చెందిన నేత కానిమహార్ విద్యార్థి విభాగం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ బీరెల్లి రజనీకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



వర్షిణిని అభినందిస్తున్న సునీత

కాటారం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన వర్షిణి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారిని చల్ల సునీత బుధవారం తెలిపారు. సోలో సాంగ్ విభాగంలో వర్షిణి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వర్షిణిని ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా అభినందించారు.

రేపు క్రీడా పోటీలు ప్రారంభం

రేగొండ: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలను ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు కొత్తపల్లిగోరి మండల విద్యాధికారి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాల బాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

15న మండల స్థాయి..

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాల ఆవరణలో ఈ నెల 15, 16 తేదీల్లో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, గురుకుల, కేజీబీవి పాఠశాలల విద్యార్థులు పాల్గొని క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం: మండలంలోని చిద్నెపల్లిలో మంథెన రాములు, దేవరాంపల్లిలో రమేశ్, రేగులగూడెంలో బాలమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గణపురంలో..

గణపురం: మండలంలోని కుందురూపల్లెకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శెట్టి, గొల్లపల్లి గ్రామానికి చెందిన బుచ్చిరాములు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్సాని లక్ష్మీ నరసింహరావు, పీఏసీఈఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, నాయకులు తోట శ్రీనివాస్, పెంచాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రేగొండ: పరకాల మండలం రాజుపేట గ్రామానికి చెందిన సాదు రాజయ్య అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. రాజయ్య రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని అతడి కూతురు చెక్క వసంత ఇంటికి ఈ నెల 7న వచ్చాడు. కాగా ఈ నెల 8న వృద్ధుడు గణపురంలోని తన అక్క ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కాని అక్క ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో వృద్ధుడి కూతురు వసంత పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



దేవేందర్ (ఫైల్)

కాటారం(మహాముత్తారం): మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారానికి చెందిన కావటి దేవేందర్(33) కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 8న మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.